మొదలైన రేషన్ కష్టాలు

- ఎండీయూ వాహనాల రద్దు
- ఉపాధి కోల్పోయిన ఆపరేటర్లు, హెల్పర్లు
- కార్డుదారులకు తప్పని పడిగాపులు

దొరవారిసత్రం/ఓజిలి : అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా చేయడం లేదు. పైగా ప్రజలకు అనుకూలంగా ఉన్న పథకాలను రద్దు చేస్తూ తుగ్లక్ పరిపాలన చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కోరి అమలుచేసిన అనేక సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ ప్రజలను క్షోభకు గురిచేస్తోంది. ప్రజల ముంగిటకే రేషన్ సరుకులు అందించేందుకు తీసుకువచ్చిన ఎండీయూ వాహనాలను రద్దు చేసింది. తద్వారా ప్రతి నెలా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేసే వ్యవస్థను రూపుమాపింది. దీంతో ప్రజలు పనులు మానుకుని మళ్లీ రేషన్ షాపుల ముందు పడిగాపులు పడాల్సిన పరిస్థితిని తీసుకువచ్చింది. ఎండీయూ వాహనాల రద్దుతో ఎంతోమంది ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి కోల్పోయారు.





దొరవారిసత్రంలో లబ్ధిదారులకు ఇంటి వద్దే రేషన్ అందజేస్తున్న సిబ్బంది, ఓజిలి మండలం నెమళ్లపూడిలో..

సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలో కార్డులు, ఎండీయూ, రేషన్ షాపుల వివరాలు

మండలం	ఎండీయూ వాహనాలు	రేషన్ షాపులు	రేషన్ కార్డులు
దొరవారిసత్రం	07	41	11,680
నాయుడుపేట	15	47	21,488
ఓజిలి	07	32	11,638
పెళ్లకూరు	07	34	11,209
సూళ్లూరుపేట	13	43	21,106
తడ	09	38	14,440

వాహనాలతో రేషన్ అందించాలి



గతంలో ప్రతినెలా రేషన్ సరుకుల కోసం పనులు వదిలేసి చౌకదుకాణాల వద్ద పడిగాపులు పడేవాళ్లం. జగనన్న ఐదేళ్లు ఇంటి వద్దకే వాహనాన్ని పంపించి రేషన్ అందజేశారు. ఇప్పుడు చంద్రబాబు వల్ల మళ్లీ కష్టాలు తప్పడం లేదు. వాహనాలతోనే సరుకులు అందించాలి.

- కె.జ్ఞానమ్మ, మైలాంగం, దొరవారిసత్రం

ఉపాధి కోల్పోయాము



ఎండీయూ వాహనాలను నమ్ముకుని జీవనం సాగిస్తున్నాము. ఇప్పుడు ఎండీయూ వాహనాలను రద్దు చేయడం వల్ల ఉపాధి కోల్పోయాం. మా కుటుంబాలు వీధిన పడ్డాయి. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేసి ఆపరేటర్లు, హెల్పర్లకు న్యాయం చెయ్యాలి.

- కర్లపూడి భానుప్రభాష్, దొరవారిసత్రం

లబ్ధిదారులకు ఎంతో మేలు కలిగింది



జగనన్న ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చి పేదలకు ఇంటి వద్దే సరుకులు అందజేశారు. మాలాంటి ఎంతోమందికి ఉపాధి కల్పించారు. పేదలకు ఎంతో మేలు చేసిన ఎండీయూ వాహనాలను రద్దు చేయడం దారుణం. ప్రభుత్వం కక్ష సాధింపు తగదు.

- గిరి, గ్రద్దగుంట, ఓజిలి మండలం

పేదలపై కక్షసాధింపు తగదు



పేద ప్రజలకు మంచి జరగాలన్న ఉద్దేశంతో జగనన్న ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐదేళ్ల పాటు పేదలకు ఇంటి వద్దే సరుకులు అందజేశారు. అలాంటి వాహనాలను రద్దు చేయడం దారుణం. పేద ప్రజలపై రాజకీయ కక్ష సాధింపు తగదు.

- పాదర్తి హరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఓజిలి మండలం

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న వీరరాఘవయ్య, జైతున్‌బీ

ఓజిలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని డిస్ట్రిక్ మోడల్ మేకర్ వీరరాఘవయ్య, ఓజిలి ఇన్‌చార్జి జైతున్‌బీ తెలిపారు. స్థానిక ఎంపీడీవో ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు లేకుండా కషాయాలు, ఘనజీవామృతం, సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు తినడం వల్ల రోగాలు రావన్నారు. సిబ్బంది రాజేష్, గురవయ్య, చెంచమ్మ, ప్రశాంతి, మాధురి, సాయిప్రియ, షబానా, రేవతి, సుమతి, చెంచులక్ష్మి, సిద్ధమ్మ, ఉమ, నారాయణ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన ప్రవీణ



సంజీవయ్యను సత్కరిస్తున్న పాకనాటి ప్రవీణ

ఓజిలి: సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను సోమవారం నెల్లూరులోని ఆయన నివాసంలో ఓజిలి మండలం కుందాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, నియోజకవర్గ అంగన్‌వాడీ వింగ్ కన్వీనర్ పాకనాటి ప్రవీణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజీవయ్యను శాలువాతో సత్కరించారు. ఓజిలి మండలంలోని పలు రాజకీయ అంశాలపై ఆయనతో చర్చించారు.

యోగాతో మానసిక ఉల్లాసం



చెంబేడులో యోగా చేస్తున్న విద్యార్థులు

పెళ్లకూరు : యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈవో శంకరయ్య తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సోమవారం చెంబేడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా జ్ఞాపకశక్తి పెరిగి విద్యలో రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్, సిబ్బంది మాధురి, సువర్ణకుమారి, వంశీప్రియ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలు



జాతీయ రహదారిపై బోల్తాపడిన కారు

పెళ్లకూరు : మండలంలోని పెన్నేపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున కారు బోల్తా పడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్, పోలమ్మ, రమణయ్య కారులో తమిళనాడులోని వేలూరు నుంచి స్వగ్రామం వస్తున్నారు. మార్గమధ్యంలోని పెన్నేపల్లి సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు అక్కడికి చేరుకుని వారిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు చెన్నైకి పంపించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎమ్మార్సీకి చేరిన విద్యాసామగ్రి



విద్యాసామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈవో–2 జిలానీబాష

రాపూరు : మండలంలో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అందజేసేందుకు పాఠ్య, నోటు పుస్తకాలు, బెల్టులు, బ్యాగులు ఎమ్మార్సీకి వచ్చినట్లు ఎంఈవో- 2 జిలానీ బాష తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. మొదటి విడతగా 15,336 పాఠ్య పుస్తకాలు, 20,796 నోటు పుస్తకాలు, 4,044 బ్యాగులు, 2,765 బెల్టులు వచ్చాయన్నారు. వీటిని బాలుర ఉన్నత పాఠశాలలో భద్రపరిచినట్లు వెల్లడించారు. మిగిలినవి కూడా త్వరలోనే రానున్నాయని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమైన వెంటనే వాటిని పిల్లలకు అందజేస్తామని తెలిపారు.

కాకాణి అరెస్ట్ దారుణం



రాహుల్‌రెడ్డి

దొరవారిసత్రం : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్ట్ చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ దొరవారిసత్రం మండల కన్వీనర్ అల్లూరు రాహుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పరిపాలన సాగుతోందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేశారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు



జెడ్పీహైస్కూల్ వద్ద తెగి కింద పడిన విద్యుత్ తీగలు

చిట్టమూరు : మండలంలోని ఆరూరు గిరిజన కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం రాత్రి గాలీవానకు విద్యుత్ తీగలు తెగి కిందపడిపడ్డాయి. దీంతో సోమవారం ఉదయం వరకు గిరిజన కాలనీలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఉదయం అక్కడికి చేరుకుని తెగిపడిన విద్యుత్ తీగలకు మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. మండలంలో చిన్నపాటి గాలీవానకే విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయని మల్లాం గ్రామస్తులు తెలిపారు. ఆరూరు ఫీడర్‌కు రెగ్యులర్ లైన్‌మన్ లేకపోవడంతో ఇన్‌చార్జి లైన్‌మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. రెగ్యులర్ లైన్‌మన్‌ను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యోగా డే విజయవంతానికి కృషి

తడ: వచ్చే నెల 21న నిర్వహించనున్న యోగా డే విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. ఆయన సోమవారం విద్య, వైద్య, పీఆర్, ఐకేపీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 10 వేల మందికి తగ్గకుండా యోగాంధ్ర వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. వారికి శిక్షణ అనంతరం సచివాలయాల వారీగా 15 అంశాల్లో మండల స్థాయిలో పోటీలు నిర్వహించి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ విజయ్‌కుమార్, డాక్టర్లు కిషోర్, రాజు, ఐకేపీ ఏపీఎం రాజారెడ్డి, పీఆర్ ఏఈ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో పేరు నమోదు చేసుకోవాలి

ఓజిలి : ప్రజలు యోగాంధ్రలో పేర్లు నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. జూన్ 21న జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలను చైతన్యం చేసి ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణా తరగతులు

నాయుడుపేట టౌన్ : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగులు, మెప్మా, మున్సిపల్ సిబ్బందికి యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు తరగతులు ఉంటాయని వెల్లడించారు.

సచివాలయాల ఉద్యోగులకు యోగాలో శిక్షణ

కోట : సచివాలయాల ఉద్యోగులకు యోగా శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో దిలీప్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 16 సచివాలయాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి ఒక్కొక్క క్లస్టర్‌కు ఒక యోగా గురువును నియమించనున్నట్టు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఐదురోజులు యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కోట సచివాలయం, చిట్టేడు జెడ్పీ హైస్కూల్, చెందోడు యూపీ స్కూల్, సిద్ధవరం సచివాలయం కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. సచివాలయాల్లో పనిచేసే సిబ్బందితో పాటు, యోగాపై మక్కువ ఉన్న వారు ఉదయం 8 గంటలకు యోగా శిక్షణలో పాల్గొనవచ్చని వెల్లడించారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు జూన్ 1 నుంచి వారి సచివాలయాల పరిధిలో యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, డిప్యూటీ ఎంపీడీవోలు నాలుగు యోగా శిక్షణ కేంద్రాలకు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

ముగిసిన యోగా శిక్షణా తరగతులు

గూడూరు రూరల్ : గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సచివాలయాల్లో యోగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ క్రమంలో శిక్షకులకు మూడు రోజులు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారని తెలిపారు.

నేటి నుంచి యోగా పోటీలు

గూడూరు పట్టణంలోని సచివాలయాల్లో మంగళవారం నుంచి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



గూడూరులో యోగాలో శిక్షణ ఇస్తున్న శిక్షకులు

పారిశుద్ధ్య కార్మికురాలిని ఆదుకోవాలని వినతి



భారతిని పరామర్శిస్తున్న యూనియన్ నాయకుడు

నాయుడుపేట టౌన్ : మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తూ తీవ్రంగా గాయపడిన పారిశుద్ధ్య కార్మికురాలు భారతిని ఆదుకోవాలని కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు కోరారు. ఆయన సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భారతిని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ భారతి రెండు రోజుల క్రితం ఒక ఇంటి వద్ద చెత్తను సేకరిస్తూ కాలు జారి కింద పడిందని తెలిపారు. కాలికి తీవ్ర గాయం కావడంతో ప్రైవేటు వైద్యశాలలో చేరి శస్త్ర చికిత్సలు చేసుకున్నట్టు తెలిపారు. బాధితురాలిని మున్సిపల్ అధికారులు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు

ప్రారంభమైన వర్షాలు



చిట్టమూరులో కురుస్తున్న వర్షం

ఓజిలి: మండలంలోని కురుగొండ, రాచపాళెం, వెంకటరెడ్డిపాళెం, మానమాల, ఓజిలి గ్రామాల్లో సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. నైరుతీ రుతు పవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

చిట్టమూరులో..

చిట్టమూరు : మండలంలో సోమవారం సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లబడింది. నైరుతీ రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించి ఏపీలోకి విస్తరించడంతో వర్షాలు ప్రారంభమైనట్టు తెలియడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో 2 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఇప్పుడు వర్షాలు ప్రారంభం కావడంతో మరో 2 వేల హెక్టార్లలో రైతులు వరినాట్లు వేయనున్నట్టు ఏవో సుచేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రధానంగా స్వల్పకాలిక వంగడాలు ఎంటీయూ 1010, కేఎన్‌ఎం రకాలు నాటుతున్నారన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



రేషన డీలర్లతో సమీక్షిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

గూడూరు రూరల్ : రేషన్ డీలర్లు సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆయన సోమవారం గూడూరు మండలం, పట్టణానికి చెందిన 56 మంది డీలర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సరుకులు అందించే సమయంలో వేళలు పాటించాలని తెలిపారు. కార్డుదారులకు సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలని, ఎక్కడా తూకంలో తేడాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రతి నెలా కార్డుదారులకు బియ్యం, చక్కెర, కందిపప్పు, గోధుమలు, ఇతర సరుకులు అందించాలని తెలిపారు. వచ్చే నెల నుంచి చౌకదుకాణాల వద్దే సరుకులు అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నూతనంగా రేషన్ కార్డులు అందజేస్తున్నందున అర్హత ఉన్న వారంతా కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమీపంలోని సచివాలయంలో దరఖాస్తులు అందించడంతో పాటు అందుకు అవసరమైన ఆధార్ కార్డులు అందించాలని సూచించారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పంటా శ్రీనివాసులురెడ్డి

చిల్లకూరు : గూడూరు నుంచి విందూరు మీదుగా గిద్దలూరు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు దెబ్బతినిందని, దాన్ని బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. ఆయన సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం ఈ రోడ్డును నిర్మించారని తెలిపారు. తర్వాత దాని గురించి పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీంతో పూర్తిగా దెబ్బతినిందని, 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

కడివేడులో ఆగిన భూముల సర్వే

- పెద్దల ఒత్తిడితోనే నిలిపివేశారని ఆరోపణలు
- సమస్య కొలిక్కి వస్తున్న తరుణంలో సర్వే నిలిపివేతపై అనుమానాలు



కడివేడులో రీసర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

చిల్లకూరు : కడివేడు రెవెన్యూ పరిధిలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న భూ సమస్యను పరిష్కరించడానికి చేపట్టిన సర్వే సోమవారం ఆగిపోయింది. దీంతో భూముల హక్కుదారులుగా ఉన్న పేదలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చిల్లకూరు మండలం కడివేడు రెవెన్యూలోని భూముల పూర్తి రికార్డులు అందుబాటులో లేవు. ఇక్కడ వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిలో కొంత భూమిని ప్రభుత్వం గతంలో కొంతమంది పేదలకు పట్టాలు ఇచ్చింది. మిగిలిన భూములతో పాటు పట్టాలు ఇచ్చిన భూములను రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన బడాబాబులు ఆక్రమించుకుని అధికారులకు ముడుపులు చెల్లించి రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. దీంతో వివాదం నెలకొంది. స్థానిక రెవెన్యూ, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో రెవెన్యూ కోర్టులు నిర్వహించినా ఫలితం లేదు. ఈ భూముల విషయంలో నెలకొన్న గందరగోళాన్ని పరిష్కరించేందుకు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఫిబ్రవరిలో రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఇందుకోసం 11 బృందాలను నియమించారు. కడివేడులోని 7,764 ఎకరాల భూమిని రీ సర్వే చేయాలని ఆదేశించారు. సర్వే బృందాలు రీ సర్వే ప్రక్రియను చేపట్టాయి. ప్రతిరోజూ ఒక బృందం 10 ఎకరాలకు తక్కువ లేకుండా సర్వే చేసి భూమిని ఎవరు సాగు చేసుకుంటున్నారో తెలుసుకుని వారి వద్ద ఉన్న ఆధారాలను సేకరిస్తున్నారు. అంతేగాక ఆ భూములకు హద్దులు ఏర్పాటు చేసి రికార్డులు సరిచేస్తున్నారు. సజావుగా సాగుతున్న సర్వేను నిలిపివేయాలని జేసీ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో సర్వే బృందాలు సర్వే చేయడం ఆపేశారు. సజావుగా సాగుతున్న సర్వే ప్రక్రియను అకస్మాత్తుగా నిలిపివేయడంపై పలు అనుమనాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వే పూర్తి స్థాయిలో జరిగితే భూముల్లో పాగా వేసిన బడాబాబుల బండారం బయట పడుతుందనే అధికారులపై ఒత్తిడి తీసుకుని వచ్చి నిలిపివేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా సర్వే చేపట్టేందుకు గతంలో జేసీ రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. సర్వే ప్రక్రియలో మార్పులు చేసేందుకు కొన్ని అనివార్య కారణాలతో తాత్కాలికంగా నిలిపి వేయాలని మౌఖికంగా ఆదేశించారని, అందువల్లే సర్వేను నిలిపివేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన నాగయ్య

బాలాయపల్లి(సైదాపురం) : నిడిగల్లు - పిగిలాం రైల్వేస్టేషన్ల మధ్యలో ఆదివారం రైలు ఢీకొని బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన అమ్మినేని నాగయ్య (50) మృతి చెందాడు. నిడిగల్లు–పిగిలాం గ్రామాల మధ్య రైల్వే మార్గంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో రైల్వే పోలీసులు సోమవారం పరిశీలించారు. మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విచారణలో అతను పిగిలాం గ్రామానికి చెందిన అమ్మినేని నాగయ్యగా తేలింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతను రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కండలేరులో 41.598 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 41.598 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,880, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజనుల కోసం ఆధార్ క్యాంపు

కోట: తీరప్రాంతమైన కొత్తపట్నం సచివాలయంలో సోమవారం గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపును అధికారులు ప్రారంభించారు. ఆధార్ సేవలు అందక గిరిజనులు ఇబ్బంది పడుతున్న క్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. అదే విధంగా పింఛన్లు, పక్కా గృహాలు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్ధన, అధికారులు మోహన్‌రావు, మునిరాజ, ఉమామహేశ్వరి, పద్మ, హరికృష్ణ, మెహతాజ్, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఓజిలి: సంఘబంధం, పొదుపు గ్రూపుల్లో రుణాలు తీసుకున్న వారు సకాలంలో రుణాలు చెల్లించాలని ఉన్నతి డీపీఎం విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలతో ఈసీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 30 సంఘబంధం సభ్యులతో ఫేస్‌యాప్ చేయించాలన్నారు. అనంతరం సభ్యులకు జీవనోపాధి కల్పించేందుకు మెక్రోక్రెడిట్ ప్లాన్, ఉన్నతి, శ్రీనిధిపై చర్చించారు. యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మమ్మ, సీసీ, సంఘబంధం అధ్యక్షులు పాల్గొన్నారు.

నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

సూళ్లూరుపేట : చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ సమీపంలోని కాళంగి నదిలో పడిన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు సోమవారం వెలికితీశారు. మృతుడు సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధికి చెందిన సుబ్రమణ్యం (27)గా గుర్తించారు. అతను ఆదివారం రాత్రి బైక్‌లో ఇంటి నుంచి బయలుదేరాడు. కాళంగినది వంతెన మీద వెళుతుండగా ఎదురుగా వాహనాలు రావడంతో నది వంతెన గోడను ఢీకొన్నాడు. అదుపు తప్పి వంతెన గోడ మీద నుంచి నదిలో పడిపోయాడు. గమనించిన కొంతమంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అగ్నిమాపక సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చీకటిగా వుండడంతో గాలింపు చర్యలను నిలిపేశారు. సోమవారం ఉదయాన్నే గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు సుబ్రమణ్యంగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బ్రహ్మానాయుడు తెలిపారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం

చిల్లకూరు : ప్రజల రెవెన్యూ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన సోమవారం వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, సచివాలయాల్లో అందించే అర్జీలను త్వరితగతిన పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా భూసమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా వీఆర్ఏను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆర్‌ఐ పూర్ణచంద్ర, ఏఎస్‌వో బాషా పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

కోట : ఇంటి బయట నిలిపిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసినట్టు విద్యానగర్ సాయినగర్‌కు చెందిన క్రిష్ణ వాపోయాడు. అతను సోమవారం ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశాడు. వాహనాన్ని రెడ్ కలర్ బనీను ధరించిన వ్యక్తి ఎత్తుకెళ్లినట్టు నమోదైన సీసీ పుటేజీని అందజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

చిల్లకూరు : మండలంలోని బెస్తపాళెం సమీపంలో రొయ్యల గుంతల వద్ద కూలి పనికి వచ్చిన యువకుడు అనుమనాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బెస్తపాళెంకు చెందిన మధుసూదన్ రొయ్యల గుంత వద్ద ఏడాది నుంచి మన్యం జిల్లా పార్వతీపురం వాసులు ఐదుగురు యువకులు పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి వారు పనులు ముగించుకుని నిద్రకు ఉపక్రమించారు. సోమవారం ఉదయం మందంగి అప్పన్న (35) ఎంత సేపటికీ నిద్రలేవలేదు. తోటి కూలీలు రొయ్యల గుంత యజమానికి సమాచారం ఇచ్చారు. ఆయన యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాతే పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.